క్లుప్తంగా

8న చెస్ పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మినీబైపాస్‌లోని నక్షత్ర స్కూల్లో ఆలిండియా చెస్ పోటీలను ఈ నెల 8న నిర్వహించనున్నామని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ తెలిపారు. టోర్నీకి సంబంధించిన పోస్టర్లను స్కూల్లో గురువారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు తదితరాలను అందజేయనున్నామని వివరించారు. వివరాలకు 83411 47514, 85025 73324 నంబర్లను సంప్రదించాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్లు గాదిరాజు జీవన్‌కృష్ణ, సంధ్యారెడ్డి, సాయిప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ జోనల్ అధ్యక్షురాలిగా నియమితులైన మొయిళ్ల గౌరి, సురేష్‌రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ప్రసన్నకు అనిల్ పరామర్శ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ గురువారం పరామర్శించారు. కోవూరులో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైన తరుణంలో అభినందనలను తెలియజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించేందుకు గానూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరొచ్చే అంశంపై చర్చించారు.

యోగాతో ఆరోగ్యం



నెల్లూరు(అర్బన్): యోగాతో ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందం కలుగుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, సర్వజన ఆస్పత్రిలో వైద్య, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, శానిటరీ వర్కర్లకు యోగాపై శిక్షణను గురువారం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ విభాగాధిపతి నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా, నోడల్ అధికారి శివరామ్, డాక్టర్ వైష్ణవి, యోగా మాస్టర్లు రవీంద్ర, భవాని తదితరులు పాల్గొన్నారు.

యోగా కార్యక్రమం నేడు

నెల్లూరు రూరల్: యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఏడుకు నిర్వహించనున్నామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ తెలిపారు. భారీగా తరలిరావాలని కోరారు.

శేషజీవితాన్ని హాయిగా గడపాలి



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ తదితరులు

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది తమ శేషజీవితాన్ని కుటుంబసభ్యులతో హాయిగా గడపాలని ఎస్పీ కృష్ణకాంత్ కాంక్షించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సైలు విజయ్‌కుమార్, జయరాజు, హెచ్‌సీ అహ్మద్, హెచ్‌జీ మల్యాద్రిని నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో గురువారం సత్కరించారు. ఏఎస్పీ సౌజన్య, ఏఆర్, హోంగార్డ్స్ డీఎస్పీలు చంద్రమోహన్, రమణ, ఏఓ చంద్రమౌళి, పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న అధికారులు, విద్యార్థులు

నెల్లూరు సిటీ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి.. వాటి సంరక్షణను బాధ్యతగా భావించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తూరులోని నగరవనంలో వన మహోత్సవాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మొక్కలు నాటిన అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 4.3 లక్షల మొక్కలను నాటాలనే లక్ష్యంతో వన మహోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కమిషనర్ నందన్, డీఎఫ్ఓ మహబూబ్‌బాషా, ఆర్డీఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (పొగతోట): పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కోరారు. నగరంలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

➡ ఏపీజీబీ మేనేజర్లతో సమీక్ష సమావేశాన్ని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, డీజీఎం అరుణ్‌కుమార్ హాజరై మేనేజర్లకు పలు సూచనలు చేశారు. రీజినల్ మేనేజర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని విశ్వసాయి స్కూల్ చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. చిల్డ్రన్స్‌పార్కు సమీపంలోని స్కూల్లో ఆయుర్వేద మొక్కలు, వాటి విశిష్టతను వివరించారు. అనంతరం ర్యాలీని నిర్వహించి.. తులసి, కలబంద తదితర మొక్కలు, కాలుష్య రహిత పేపర్ బ్యాగులను పంపిణీ చేశారు. శివసంకేత్, ప్రిన్సిపల్ రఘురామ్, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

➡ నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల హాస్టల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆర్ఐఓ వరప్రసాదరావు, ప్రిన్సిపల్ రమణారెడ్డి, ఎన్నెస్సెస్ అధికారులు ప్రసన్న, భారతి, సీనియర్ అధ్యాపకుడు కొండయ్య పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): భూమిపై పేరుకుపోతున్న ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించేందుకు గానూ ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ సుజాత పేర్కొన్నారు. సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణాన్ని కాపాడతామంటూ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఎపిడెమాలజిస్ట్ భాస్కర్, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డెమో అధికారి కనకరత్నం, ఏఓ నిశాంత్‌రెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లలో మొక్కలు నాటామని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెం సమీపంలోని పీఏసీఎస్‌లో మొక్కలు నాటారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికుమార్, సీఈఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ కార్యాలయ ఆవరణలో..



విశ్వసాయి స్కూల్లో..



డీఎంహెచ్ఓ కార్యాలయంలో..



చింతారెడ్డిపాళెం పీఏసీఎస్‌లో..

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సౌజన్య

నెల్లూరు(క్రైమ్): బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఏఎస్పీ సౌజన్య సూచించారు. బక్రీద్‌ను పురస్కరించుకొని నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. అవాంఛనీయ ఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు నెలకొంటే ప్రజలు తక్షణమే స్థానిక పోలీసులు లేదా 112కు సమాచారం అందించాలని కోరారు. నగర డీఎస్పీ సింధుప్రియ, ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, వేణుగోపాల్‌రెడ్డి, దశరథరామారావు, రోశయ్య, శ్రీనివాసరావు, సాంబశివరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి శిలాఫలకం ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డికాలనీలోని లక్ష్మీపార్వతినగర్‌లో నిర్మించనున్న మాతా మందిర శిలాఫలాకాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణ స్థల దాత నరసాపురం ప్రసాద్, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. కోలాటాన్ని మహిళలు ప్రదర్శించారు. సుధాకర్, ప్రభాకర్, నాగేశ్వరరావు, దశరథ్, మల్లికార్జున, రామ్మోహన్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పీసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా వెంకట్రావ్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నగరానికి చెందిన ఉడతా వెంకట్రావ్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలను తెలియజేశారు. నేతలు అల్లావుద్దీన్, మల్లికార్జునరెడ్డి, రెహ్మాన్, నరేష్, సుజాత పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పొగతోటలోని ఓ హాస్పిటల్ సమీపంలో గల కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించారు. దీనిపై రామ్మూర్తినగర్ 45 / 2 సచివాలయ వీఆర్వో సునీతకు సమాచారం అందించారు. చిన్నబజార్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు సుమారు 35 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉన్నారు. మృతుడి కుడిచేతిపై అమ్మ అనే పచ్చబొట్టుంది. జీజీహెచ్ మార్చురీకి తరలించి.. కేసు నమోదు చేశారు. మృతదేహం ఉబ్బిపోయి ఉంది. మృతి చెంది రెండు రోజులై ఉండొచ్చని భావిస్తున్నారు.





ట్రై సైకిల్‌పై విగతజీవిగా..

నెల్లూరు(క్రైమ్): ట్రై సైకిల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నగర డీఎస్పీ కార్యాలయ సమీపంలోని రహదారి పక్కన చోటుచేసుకుంది. మృతుడు సుమారు 55 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉన్నారు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యంకాలేదు. జీజీహెచ్ మార్చురీకి తరలించి.. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 00018, 94403 33191 నంబర్లకు సమాచారమివ్వాలని ఇన్‌స్పెక్టర్ రోశయ్య కోరారు.

మామపై అల్లుడి దాడి

నెల్లూరు(క్రైమ్): కుటుంబకలహాల నేపథ్యంలో మామపై అల్లుడు దాడి చేసిన ఘటనపై కేసును దర్గామిట్ట పోలీసులు గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటలో నివాసం ఉంటున్న గౌస్‌బాషా తన కుమార్తె సమీన్‌కు కోటమిట్టకు చెందిన అఫ్సర్‌తో గతేడాది వివాహం చేశారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం మనస్పర్థలతో కోర్టులో కేసు నడుస్తోంది. ఖాజీ కోర్టు వద్ద ఆమెపై అఫ్సర్ రెండు నెలల క్రితం దాడికి పాల్పడ్డారు. ఘటనపై చిన్నబజార్ పోలీసులకు అప్పట్లో ఆమె ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బారాషహీద్ దర్గాలో పనులు ముగించుకొని ఇంటికి గౌస్‌బాషా బుధవారం బయల్దేరారు. ప్రధాన ద్వారం వద్దకొచ్చేసరికి అఫ్సర్ అడ్డుకొని, తన చేతికున్న ఇనుప కడియంతో దాడి చేశాడు. గాయపడిన గౌస్‌బాషా జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బారాషహీద్ దర్గాలో ప్రత్యేక ఏర్పాట్లు

నెల్లూరు(బృందావనం): బక్రీద్‌ను పురస్కరించుకొని బారాషహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ నందన్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు, మతపెద్దలు, ముస్లిం నేతలతో దర్గాలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రార్థనల నిమిత్తం వచ్చే భక్తులకు మౌలిక వసతులను కల్పిస్తున్నామని వివరించారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పండగ

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామాల్లో చంద్రన్న పల్లెపండగ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ఈ నెల తొమ్మిది వరకు నిర్వహించనున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. రూ.11 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నామని వివరించారు.

రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలపై నిరసన

నెల్లూరు రూరల్: ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ నేతలు నిరసనను గురువారం చేపట్టారు. మూలాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు మిడతల రమేష్, పద్మ, నాగేంద్రసింగ్, చంద్ర, సుబ్బయ్య, విజయ, శివకుమార్, శ్రీనివాసులు, రామకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

కంచికామకోటి పీఠాధిపతి రాక రేపు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకరమఠానికి కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతి శనివారం రాత్రి రానున్నారని మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు గురువారం తెలిపారు. అల్లీపురంలో విఘ్నేశ్వరాలయ పునఃప్రతిష్ఠ సందర్భంగా చేపట్టే కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారని వివరించారు.

రూపాయికే డ్రైనేజీ కనెక్షన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని అన్ని డివిజన్లలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, కేవలం రూపాయికే కనెక్షన్‌ను అనుసంధానించనుండటం చరిత్రాత్మక నిర్ణయమని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల వివరాలను తన చాంబర్‌లో గురువారం ఆయన తెలియజేశారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి కేంద్రాల ద్వారా రూ.రెండుకే 20 లీటర్ల తాగునీటిని పొందొచ్చని చెప్పారు. పారిశుధ్య నిర్వహణకు గానూ 15 నూతన స్వీపింగ్ మెషీన్లను మంజూరు చేశారని తెలిపారు. చెత్త సేకరణకు గానూ త్వరలో 100 ఈ – ఆటోలను కొనుగోలు చేయనున్నామని వెల్లడించారు. దొంతాలి డంపింగ్ యార్డు సమీపంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను నిర్మించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

➡ నగరంలోని సీఏఎం హైస్కూల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ నందన్‌కు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఏఎం హైస్కూల్ గోహత్యలకు కేరాఫ్‌గా మారిందని ఆరోపించారు. పెంచలయ్య, ఖాజామస్తాన్, సత్య, రాజు, ప్రసాద్, అంకయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో
కూటమి విఫలం

- కాకాణిపై సర్వేపల్లి ప్రజలకు ఎంతో అభిమానం
- కాకాణి పూజిత



మాట్లాడుతున్న కాకాణి పూజిత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి హామీని నిలబెట్టుకున్నారని, అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని కాకాణి పూజిత పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆమె మాట్లాడారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గానికి ఎంతో సేవ చేశారని చెప్పారు. ఆయనపై ప్రజల్లో ఉన్న అభిమానం ఆపితే ఆగేది కాదని పేర్కొన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి నిరసన తెలిపారన్నారు. ప్రభుత్వం, అధికారులు ప్రజల సంక్షేమం కోసం పని చేయాలని హితవు పలికారు. కొందరు అధికారులు పరిధి దాటి నియంతల్లా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే అడుగడుగునా ఆటంకాలు సృష్టించారని ఆరోపించారు. ప్రజాసమస్యలపై మాట్లాడకూడదనే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని చెప్పారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రజలు ఉత్సాహంతో కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. అధికారులు మీడియానూ అడ్డుకున్న పరిస్థితిని చూశామని, కూటమి ప్రభుత్వంలో పత్రికలు స్వేచ్ఛగా వ్యవహరించే పరిస్థితుల్లేవానని ప్రశ్నించారు. గోవర్ధన్‌రెడ్డిని జైల్లో పెట్టినా, కార్యకర్తలు, నాయకులను ఇబ్బందులకు గురిచేసినా, కేసులు పెడతామని భయపెట్టినా నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. అరెస్టులు, కేసులతో నాన్నపై సర్వేపల్లి ప్రజలకు ఉన్న అభిమానాన్ని ఆపలేరన్నారు. నిరసన కార్యక్రమంలో అధికారులు అడుగడుగునా అడ్డుకున్నా, రక్షణగా సర్వేపల్లి ప్రజలు నిలబడ్డారన్నారు. గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కార్యక్రమం చేపట్టలేదని అవహేళనతో అడ్డంకులు సృష్టించిన వారందరికీ ఈ కార్యక్రమం విజయవంతం కావడం చెంపపెట్టు అన్నారు. ఎంపీలు మిథున్‌రెడ్డి, గురుమూర్తికి ధన్యవాదాలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి



నెల్లూరు(అర్బన్): బదిలీల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రాన్ని సంఘ నేతలతో కలిసి గురువారం అందజేసిన అనంతరం సుధాకర్‌రావు మాట్లాడారు. బదిలీల్లో తమ సంఘానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. అనంతరం డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. హంస పబ్లిసిటీ సెక్రటరీ మజహర్, జిల్లా నేతలు జలీల్ అహ్మద్, గౌస్‌బాషా, రాజయ్య, మురళి, నాగరాజమ్మ, వెంకటసుబ్బయ్య, ఉషారాణి, జయలక్ష్మి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అన్నదానం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జీజీహెచ్‌లోని సత్యసాయి ట్రస్ట్‌లో రోగుల సహాయకులకు అన్నదానాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ కోచ్ హుస్సేన్ సౌజన్యంతో గురువారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, సభ్యులు స్వర్ణ రమేష్, జయదేవ్, సుబ్బారెడ్డి, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన



నెల్లూరు సిటీ: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిపోల్లో నిరసనను ఎన్ఎంయూ ఆధ్వర్యంలో మూడో రోజు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ఆర్ఎంకు గతంలో వినతిపత్రాన్ని అందజేసినా, ఎలాంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. జిల్లాలోని అన్ని డిపోల్లో ఎర్ర బ్యాడ్జీలను ధరించి నిరసనను చేపట్టామని చెప్పారు.

శ్రీనివాసరావుకు పరామర్శ





నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావును జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం పరామర్శించారు. ఆయన తల్లి పద్మావతి ఇటీవల మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ నేతలు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, శ్యామ్‌సింగ్, చంద్రశేఖర్, మోహన్‌రావు ముదిరాజ్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

➡ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు కుటుంబసభ్యులను మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ పరామర్శించారు. ఆయన తల్లి పద్మావతి ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, శ్రీధర్‌రెడ్డి, కొండ్రు అనిల్, శ్యామ్‌సింగ్, చంద్రశేఖర్, మోహన్‌రావు ముదిరాజ్, రమాదేవి, చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, సతీష్, వీరపరెడ్డి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బోన్‌మ్యారోకు అధునాతన చికిత్స

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ హాస్పిటల్, కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక విధానాలతో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సలను నిర్వహిస్తున్నామని ఆస్పత్రి మెడికల్ ఆంకాలజిస్ట్ రంగరామన్ తెలిపారు. ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటోలోగస్, అల్లోజెనిక్ ట్రాన్స్‌ప్లాంటేషన్ల ద్వారా రోగాన్ని పూర్తిగా నయం చేస్తున్నామని చెప్పారు.